క్లుప్తంగా

జెడ్పీ చైర్‌పర్సన్ పరామర్శ



మామిడిపల్లిలో వెంకటేశ్వర్లు కుటుంబాన్ని పరామర్శిస్తున్న చైర్‌పర్సన్ విజయ

సోంపేట: బారువ, మామిడిపల్లి గ్రామాల్లో పలు కుటుంబాలను జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ, ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాస్ బుధవారం పరామర్శించారు. బారువ మేజర్ పంచాయతీ పాలకవర్గ సభ్యురాలు సూరాడ లలిత తండ్రి నారాయణరావు, మామిడిపల్లిలో కదంబాల వెంకటేశ్వరులు చనిపోవడంతో వారి కుటుంబాలను పరామర్శించి సంతాపం తెలియజేశారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులు శిలగాన భాస్కరరావు, వైస్ ఎంపీపీ గురాల శ్రీను, బారువ సర్పంచ్ యర్ర రజని, మామిడిపల్లి ఎంపీటీసీ సభ్యుడు దున్న మాధవరావు ఉన్నారు.

విద్యుదాఘాతంతో యువకుడు మృతి

సోంపేట: మండలంలోని కొర్లాం పంచాయతీ బ్రాహ్మణ కొర్లాం గ్రామంలో వివాహానికి క్లాత్ డెకరేషన్ ఏర్పాటు చేస్తుండగా పలాసకు చెందిన యువకుడు చల్ల తిరుపతి (22) విద్యుత్ షాక్ కొట్టి చనిపోయాడు. వివాహ వేడుకకు క్లాత్ డెకరేషన్ ఏర్పాటు చేయడానికి పలాసకు చెందిన కొంచాడ సురేష్, కొంత మంది కలిసివచ్చారు. బుధవారం రాత్రి డెకరేషన్ చేస్తుండగా 11 కేవీ విద్యుత్ వైర్లు తగిలి చల్ల తిరుపతికి తీవ్ర గాయాలయ్యాయి. సోంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. బారువ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

'తరగతుల విలీనం వద్దు'

కంచిలి: కర్తలి ప్రాథమిక పాఠశాలలోని 3, 4, 5 తరగతులను మఠం సరియాపల్లి పాఠశాలలో విలీనం చేయాలనే ఆలోచనను విరమించుకోవాలని ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి, గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఈ విషయమై కర్తలి గ్రామస్తులతో కలిసి మండల విద్యావనరుల కేంద్రానికి బుధవారం వచ్చి ఎంఈవో శివరాం ప్రసాద్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. స్కూల్ మెర్జింగ్ విధానాన్ని అమలుచేసే ప్రక్రియలో తమ పాఠశాలలో 3, 4, 5 తరగతుల్ని ఎట్టి పరిస్థితుల్లోను వేరేచోట విలీనం చేయవద్దని కోరారు. తరగతులను విలీనం చేస్తే తమ గ్రామ పిల్లలు ఆంధ్రా-ఒడిశా సరిహద్దుకు ఉండే ప్రధాన మార్గం గుండా మఠం సరియాపల్లి పాఠశాలకు చాలా ఇబ్బందులతో వెళ్లాల్సి ఉంటుందన్నారు. మాజీ సర్పంచ్ పైల సూర్యనారాయణరెడ్డి, వాసాల రమేష్, పైల గణేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆపన్నులకు అండగా..

ఇచ్ఛాపురం రూరల్: ఈదుపురం గ్రామానికి చెందిన వృద్ధుడు కుండల శ్రీనుకు కొంత కాలంగా కళ్లు కనిపించడం లేదు. విషయం తెలుసుకున్న సీడాప్ మాజీ చైర్మన్ సాడి శ్యామ్ ప్రసాద్‌రెడ్డి బుధవారం వృద్ధుడుకు సెన్సార్ చేతి కర్రను అందజేశారు. సర్పంచ్ నర్తు ప్రసాదరావు పాల్గొన్నారు. అలాగే పితాతొళి గ్రామానికి చెందిన దివ్యాంగుడు త్రినాథ్‌శెట్టికి సన్యాసిపుట్టుగ హెల్పింగ్ హ్యాండ్స్ ఆర్గనైజేషన్ సభ్యులు రూ. పది వేలు అందజేశారు. సంస్థ సభ్యులు కాతిల లలిత, నీలాపు దుర్యోధన, సావాడ గణేష్, దక్కత శంకర్, దుర్గాశి రవి, నీలాపు హేమారాజు, వంశీలు పాల్గొన్నారు.

నందిగాం: నందిగాం ఉన్నత పాఠశాలలో 1987–92 విద్యా సంవత్సరంలో చదివిన విద్యార్థుల బాల్యమిత్ర బృందం సభ్యులు పాఠశాలకు బీరువా, పదో తరగతి చదువుతున్న 66 మంది విద్యార్థులకు పైల్స్ విత్ పోల్డర్స్‌ను అందజేశారు.

ఛత్రపతి శివాజీకి ఘన నివాళులు

కవిటి: హిందూ సామ్రాజ్య స్థాపన కోసం అవిశ్రాంతంగా కృషి చేసిన ఛత్రపతి శివాజీ మహారాజ్ సేవలు అమూల్యమైనవని వక్తలు అన్నారు. మండలంలోని వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలలో శివాజీ జయంతి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. శివాజీ మహారాజ్ నాయకత్వం, ధైర్యసాహసాలు, ప్రజాహిత కార్యక్రమాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పిల్లలకు తెలియజేశారు.

ఆధార్ ప్రత్యేక కేంద్రాల పరిశీలన

కంచిలి: ఆధార్ స్పెషల్ కేంద్రాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో వి.తిరుమలరావు సూచించారు. మఠం సరియాపల్లి, పోలేరు, కంచిలి-2, డి.జి.పురం సచివాలయాల్లో ప్రత్యేక కేంద్రాలను బుధవారం నుంచి ఏర్పాటు చేశారు. మఠం సరియాపల్లి కేంద్రాన్ని ఎంపీడీవో పరిశీలించారు.

ప్రజల కష్టాలు!



అంబేద్కర్‌నగర్‌లో డ్రమ్ములో నీటిని ఇంటికి తీసుకువెళ్తున్న మహిళ

- పలాస–కాశీబుగ్గలో నీటి సమస్య
- వేసవి ప్రారంభానికి ముందే ఇక్కట్లు

కాశీబుగ్గ:

వేసవి ప్రారంభానికి ముందే ప్రజలు నీటి కష్టాలు ఎదుర్కొంటున్నారు. పూర్తిగాస్థాయిలో ఎండలు విజృంభిస్తే మరిన్ని ఇక్కట్లు తప్పవని జనం ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో మంచినీటి సరఫరా అస్తవ్యస్తంగా తయారైంది. ఒక రోజు నీటి సరఫరా చేస్తే తిరిగి మళ్లీ ఎప్పుడు సరఫరా అవుతుందో కచ్చితంగా చెప్పలేని పరిస్థితి నెలకుంది. నీటి సరఫరా పేరుతో లక్షలాది రూపాయలు ఖర్చు చేస్తున్నా జనానికి జల కష్టాలు వీడడం లేదు. మున్సిపాలిటీలోని 31 వార్డుల్లో నీటి సరఫరా సక్రమంగా జరపడం లేదని ప్రజలు వాపోతున్నారు. మున్సిపాలిటీ పరిధిలో సుమారు 75 వేల మంది నివాసం ఉంటున్నారు. వీరందరికీ 15 ఏళ్ల క్రితం జగన్నాథ సానంలో వేసిన ఇన్‌ఫిల్టర్ బావుల నుంచి వచ్చే నీరే ఆధారంగా మారింది. పెరుగుతున్న జనాభాకు తగ్గట్టుగా నీటి సరఫరా జరగడం లేదు. ప్రస్తుతం ఉన్న కౌన్సిలర్లు, కో–ఆప్షన్ సభ్యుల డిమాండ్ మేరకు కాశీబుగ్గలో రెండు, పలాసలో మూడు ట్యాంకర్లతో నీటిని అధికారులు సరఫరా చేయిస్తున్నప్పటికీ పూర్తిస్థాయిలో నీరు లభ్యం కావడం లేదని మహిళలు చెబుతున్నారు.

సూదికొండలో నరకమే..

19వవార్డు సూదికొండ ప్రాంతంలో దాహం కేకలు వినిపిస్తున్నాయి. అత్యధికంగా జీడి కార్మికులు జీవనం సాగిస్తున్న ఈ ప్రాంతంలో బావులు, బోర్లు, పవర్ బోర్‌లు అడుగంటాయి. మున్సిపల్ అధికారులు ఏర్పాటు చేసిన కుళాయిల ద్వారా నీటి సరఫరా నిలిచిపోవడంతో గుక్కెడు నీటి కోసం స్థానికులు పడరాని పాట్లు పడుతున్నారు. అడపాదడపా వచ్చే మున్సిపల్ వాటర్ ట్యాంకర్ల తాగునీటిని పట్టుకొని డ్రమ్ముల్లో నిల్వ చేసి వాడుకుంటున్నారు. ప్రతీ ఇంటిముందు పెద్దపెద్ద డ్రమ్ములు ఉంటున్నాయంటే పరిస్థితి ఎంతదారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. సూదికొండ ప్రాంతంలో సుమారు ఐదు వేలమంది కార్మికులు ఉన్నారు. కొత్తమ్మతల్లివీధి, అంబేడ్కర్ నగర్, రెల్లివీధి, సూర్యకాలనీ, మరిడమ్మవీధుల వాసులు నీటి కష్టాలు ఎదుర్కొంటున్నారు. మున్సిపల్ అధికారులు ప్రత్యేకంగా దృష్టిసారించి నీటి అవస్థలు మరింత పెరగకముందే చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ట్యాంకర్లతో నీటిని అందిస్తున్నాం



పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీలో ఐదు వాటర్ ట్యాంకర్లు ఉన్నాయి. వీటి ద్వారా సమస్య ఉన్న ప్రాంతాల్లో నీటిని సరఫరా చేయిస్తున్నాం. సూదికొండ ఎత్తు ప్రాంతంలో ఉండటంతో అక్కడికి సరఫరా చేయడం కష్టంగా ఉంది. రానున్న రోజులలో శాశ్వతమైన వాటర్ ప్రాజెక్టుల పనులు పూర్తయితే తప్పా సమస్య పరిష్కరించలేం. అనాధికార కుళాయి కనెక్షన్లపై ప్రత్యేక చర్యలు చేపడతాం.

– నడిపేన రామారావు, కమిషనర్, పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ

మున్సిపాలిటీ	పలాస–కాశీబుగ్గ
వార్డులు	31
ప్రజలు	75 వేలు
పవర్ బోర్‌లు	95
పెద్దబావులు	03
కుళాయిలు	1746
పబ్లిక్ కుళాయిలు	195
ట్యాంకర్‌లు	05
అవసరమైన కుళాయిలు	2500

తాగునీరు అందించండి



సూదికొండ సచివాలయం పరిధిలోని రెండు, 19, 20 వార్డుల్లో అత్యధికంగా జీడి కార్మికులు నివాసం ఉంటున్నారు. అందరూ నిరుపేదలే. పట్టణంలో ఉండాలంటే ఇంటి అద్దెలు భరించలేక సూదికొండపై నివాసానికి ఆసక్తిచూపుతున్నారు. మంచినీటికి తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. 15 ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన కుళాయిలు తప్పితే ఇంతవరకు కొత్తవి ఏర్పాటు చేయలేదు. అధికారులు స్పందించి నీటిని సక్రమంగా సరఫరా చేసి కష్టాలు తీర్చాలి.

–బమ్మిడి సంతోష్‌కుమార్, మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు



మున్సిపల్ ట్యాంకర్ వద్ద నీటిని పట్టుకుంటున్న జీడి కార్మికులు

ఇచ్ఛాపురం: మున్సిపల్ ట్యాంక్ వద్ద నీటిని పట్టుకుంటున్న ఏఎస్‌పేట వాసులు



ఇచ్ఛాపురంలో దాహం..దాహం!

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం మున్సిపాలిటీలో కూడా నీటి సమస్య ప్రజలను వెంటాడుతోంది. పట్టణ జనాభా 50 వేలకు పైబడి ఉన్నా అందుకుతగ్గట్టుగా నీటిని అధికారులు సరఫరా చేయలేకపోతున్నారు. ప్రధానంగా మొదటి మూడు వార్డుల పరిధిలోని పురుషోత్తపురం, అమీన్‌సాహెబ్‌పేట, బోర్డర్ ప్రాంతాల్లో.. అలాగే 18, 19, 20 వార్డుల పరిధిలోని రత్తకన్న గ్రామంలోని పలు వీధుల్లో నీటి వెతలు అధికంగా ఉన్నాయి. పట్టణంలో రోజు విడిచి రోజు నీటిని అధికారులు సరఫరా చేస్తుండడంతో ప్రజలకు అవస్థలు తప్పడం లేదు. ఇప్పటికే పురప్రజలకు నీటిని సరఫరా చేసేందుకు బాహుదానదిలో ఏర్పాటు చేసిన ఉటబావుల వద్ద నీరు తగ్గిపోయింది. అలాగే మున్సిపాలిటీ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఉన్న చేతిబోర్లు కూడా మరమ్మతులకు గురికావడంతో నీటి కోసం ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. రానున్న వేసవి దృష్ట్యా మంచి నీటి సమస్య మరింత జటిలంగా మారే ప్రమాదముంది. అధికారులు ముందస్తు చర్యలు తీసుకోకపోతే మరిన్ని కష్టాలు తప్పవని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



ఇచ్ఛాపురం: నీరు ఎండిపోవడంతో తుప్పలు, ముళ్లపొదలతో నిండిన బాహుదా నది

నీటిసరఫరాకు ప్రత్యేక చర్యలు



ప్రజలకు నీటి ఇబ్బందుల్లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. దీనిలో భాగంగా బాహుదానదిలో నీటిని నిలిపేందుకు సుమారు రూ. రెండు లక్షలతో రివర్ బండ్‌ను నిర్మిస్తున్నాం. పాడైన బోర్ల మరమ్మతుల కోసం సుమారు. ఐదు లక్షల విలువైన సామగ్రిని తెప్పించేందుకు సన్నాహాలు చేస్తున్నాం. వేసవిలో నీటిసమస్య తలెత్తకుండా ప్రస్తుతం రెండు ట్యాంకర్లతో పాటు వేసవి కాలమంతా నీటి సరఫరాకు రెండు వేల లీటర్ల సామర్థ్యం గల మరో ట్యాంక్‌ని అద్దెకు తీసుకుంటున్నాం.

–ఎస్.రమేష్, మున్సిపల్ కమిషనర్, ఇచ్ఛాపురం

మండల పరిషత్ సిబ్బందిపై డిప్యూటీ సీఈవో విచారణ

సంతబొమ్మాళి: ప్రభుత్వం అందించే హెచ్‌ఆర్‌ఏ తీసుకొని సుదీర్ఘ ప్రాంతాల నుంచి రాకపోకలు చేస్తామంటే కుదరదని.. పనిచేసిన చోటే నివాసం ఉండాలని జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈవో సత్యనారాయణ స్పష్టం చేశారు. 'సమయపాలన పాటించని ఉద్యోగులు' శీర్షికతో ఈ నెల 18వ తేదీన సాక్షి దినపత్రికలో ప్రచురితమైన కథనానికి జిల్లా పరిషత్ ఉన్నతాధికారులు స్పందించారు. దీనిపై స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో డిప్యూటీ సీఈవో సత్యనారాయణ బుధవారం విచారణ చేపట్టారు. ఎంపీడీవో జయంత్ ప్రసాద్, ఈవోపీఆర్డీ పద్మజ, సీనియర్ అసిస్టెంట్ డి.నర్సింగరావు తదితరుల నుంచి స్టేట్‌మెంట్లను రికార్డు చేశారు. ఇతర ప్రాంతాల నుంచి కార్యాలయానికి వస్తున్నామని వీరందరూ అంగీకరించారు. ఇక నుంచి మండల కేంద్రంలోని నివాసం ఉంటామని ఎంపీడీవో తెలియజేశారు. దీనిపై ఉన్నతాధికారులకు నివేదిక సమర్పించి చర్యలు తీసుకుంటామని డిప్యూటీ సీఈవో పేర్కొన్నారు. పంచాయతీ కార్యదర్శుల ఎస్‌ఆర్‌లు నమోదు చేయడంలో అలసత్వం వహించిన సీనియర్ అసిస్టెంట్ నర్సింగరావును తీవ్రంగా మందలించారు. ఇకపై ఇలాంటి విపునరావృతమైతే చర్యలు తప్పవని హెచ్చరించారు.

సాక్షి ఎఫెక్ట్...



ఎంపీడీవోతోపాటు ఇతర సిబ్బందిని విచారిస్తున్న డిప్యూటీ సీఈవో సత్యనారాయణ

ఎమ్మెల్సీ అభ్యర్థి 'గాదె'కు మద్దతుగా ప్రచారం

కవిటి: త్వరలో జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో గాదె శ్రీనివాసులునాయుడికి తొలి ప్రాధాన్యత ఓటువేసి గెలిపించాలని ఏపీటీఎఫ్ 1938 శ్రీకాకుళం జిల్లా ప్రధాన కార్యదర్శి బుక్కురు వెంకటేశ్వర్లు ఉపాధ్యాయులను కోరారు. ఆయనకు మద్దతుగా కవిటి మండలంలోని పలు ఉన్నత పాఠశాలను బుధవారం సందర్శించి మిత్ర సంఘాల అభ్యర్థిగా 28 సంఘాల తోడ్పాటుతో ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా పోటీ చేస్తున్న గాదె శ్రీనివాసులు నాయుడు విజయం కోసం ప్రచారం నిర్వహించారు. ఉపాధ్యాయులకు ఇవ్వవలసిన బకాయిలు సత్వర పరిష్కారానికి ఏపీటీఎఫ్ 1938 నిరంతరం కృషి చేస్తోందన్నారు. మండల ఏపీటీఎఫ్ గౌరవాధ్యక్షులు కొత్తపల్లి రంగారావు, మొర్రి గోపి, బిసాయి శ్రీరామ్మూర్తి పాల్గొన్నారు.



శిలగాంలో ప్రచారం చేస్తున్న ఏపీటీఎఫ్ ప్రతినిధులు

సంక్షిప్తంగా...

మాజీ సీఎం జగన్ పర్యటన సందర్భంగా టెక్కలి నుంచి ర్యాలీ

టెక్కలి: మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గురువారం పాలకొండ విచ్చేస్తున్న సందర్భంగా టెక్కలి వైఎస్సార్‌సీపీ కార్యాలయం నుంచి చేపడుతున్న ర్యాలీను విజయవంతం చేయాలని నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్ బుధవారం ఓ ప్రకటనలో కోరారు. నియోజకవర్గంలోని వివిధ అనుబంధ విభాగాల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఉదయం 11 గంటలకు టెక్కలి పార్టీ కార్యాలయానికి హాజరు కావాలని సూచించారు.

ఆస్పత్రిలో జంగిల్ క్లియరెన్స్

టెక్కలి రూరల్: స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి పరిసరాల్లో కొన్ని నెలలుగా పేరుకుపోయిన పిచ్చి మొక్కలను ఎట్టకేలకు తొలగించే చర్యలను అధికారులు చేపట్టారు. పిచ్చి మొక్కలు, బురద, చెత్తచెదారం పేరుకుపోవడంతో దుర్వాసన తో స్థానికులు ఇబ్బందులు పడేవారు. ఎట్టకేలకు స్పందించిన ఆస్పత్రి సిబ్బంది జేసీబీ సాయంతో బుధవారం జంగిల్ క్లియరెన్స్ పనులు చేపట్టారు.

సీహెచ్‌సీ వైద్యాధికారికి సత్కారం

ఇచ్ఛాపురం: స్థానిక ప్రభుత్వ సామాజిక ఆస్పత్రిలో వైద్యాధికారిగా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ పి.దేవేంద్రరెడ్డిని సిబ్బంది బుధవారం ఘనంగా సత్కరించారు.

కంటి రక్షణపై అవగాహన

సోంపేట: విద్యార్థులు నేత్రాలపై ప్రత్యేకదృష్టిపెట్టాలని సోంపేట మండలం జింకిభద్ర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.వేణుగోపాలరావు అన్నారు. కంటివెలుగు కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు నేత్ర రక్షణపై బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పదిమందికి ఉచితంగా కళ్లద్దాలు పంపిణీ చేశారు.

విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు అందజేత

కవిటి: కన్నుపుట్టుగ కేంద్రంగా పనిచేస్తున్న గాయిత్రి పరివార్ సంస్థ ప్రభుత్వ బడుల్లో ప్రతిభావంతులకు అందజేస్తున్న ఆర్థికసాయం ప్రశంసనీయమైనదని కవిటి మేజర్ పంచాయతీ సర్పంచ్ పూడి లక్ష్మణరావు, ఎస్ఎంసీ చైర్మన్ తెప్పల మోహన్‌లు అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నలుగురు విద్యార్థులకు.. ఒక్కొక్కరికీ రూ. ఏడు వేలు చొప్పున భారత్ వికాస్ పరిషత్ పథకంలో భాగంగా ప్రోత్సాహకాన్ని బుధవారం అందజేశారు. హెచ్ఎం బి.మల్లేశ్వరరావు, సర్పంచ్ పూడి లక్ష్మణరావు, గాయిత్రి పరివార్ సంస్థ ప్రతినిధులు బొర్ర ప్రకాష్, దేవేంద్రరాణో పాల్గొన్నారు.

ఆదిత్యలో పుస్తకావిష్కరణ

టెక్కలి: టెక్కలి ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో ఐటీ విభాగానికి చెందిన ప్రొఫెసర్ జి.నాగేశ్వరరావు రచించిన హెల్త్ కేర్ సెంటర్స్ అండ్ ఇమేజ్ ప్రాసెసింగ్ అనే పుస్తకాన్ని బుధవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ వి.వి.నాగేశ్వరరావు, ప్రిన్సిపాల్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, హెచ్‌వోడీ బి.రమేష్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేని కలిసిన ఉద్యోగ బాధితులు

ఇచ్ఛాపురం టౌన్: ఇటలీలో ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ ఇచ్ఛాపురం కేంద్రంగా చేసుకొని జిల్లాలో 350 మంది నిరుద్యోగులను ఒడిశానికి చెందిన కొచ్చెర్ల ధర్మరాజు మోసం చేసి సుమారు రూ. ఆరున్నర కోట్లతో పరారయ్యాడు. ఈ బాధితులను సీఐ కార్యాలయం వద్ద స్థానిక జనసేన ఇన్‌చార్జి దాసరి రాజు బుధవారం కలిసి విషయం తెలుసుకున్నారు. అనంతరం స్థానిక ఎమ్మెల్యే బెందాళం అశోక్ దృష్టికి తీసుకెళ్లి బాధితుల సమస్యను పరిష్కరించాలని కోరారు. స్పందించిన ఎమ్మెల్యే జిల్లా ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డితో ఫోన్‌లో మాట్లాడి విషయం తెలియజేశారు. బాధితులకు న్యాయం చేయాలని కోరారు.

పోలీసుల పల్లెనిద్ర

ఇచ్ఛాపురం రూరల్ : ప్రజల వద్దకే వెళ్లి.. వారి సమస్యలను నేరుగా తెలుసుకునేందుకు ఇచ్ఛాపురం రూరల్ పోలీసులు పల్లెనిద్ర కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇచ్ఛాపురం రూరల్ ఎస్ఐ ఇ.శ్రీనివాస్ మంగళవారం రాత్రి డొంకూరు మత్స్యకార గ్రామంలో పర్యటించి నేరుగా వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో మద్యం అమ్మకాలు, ఇసుక తరలింపు, ప్రజా వ్యతిరేక కార్యక్రమాల పట్ల ఆరా తీశారు. అర్ధరాత్రి వరకు చుట్టుపక్కల గ్రామాల్లో పర్యటించిన ఆయన స్థానిక మండపంపై పల్లెనిద్ర చేశారు.

ఘనంగా భాషా దినోత్సవం

కంచిలి: మండల వ్యాప్తంగా వివిధ పాఠశాలల్లో భాషా దినోత్సవ వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా జాడుపూడిలోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయలో ప్రిన్సిపాల్ రజనీకుమారి ఆధ్వర్యంలో ఆంగ్ల దినోత్సవాన్ని నిర్వహించారు. మరోవైపు బూరగాం జెడ్పీ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం సోమేశ్వరరావు ఆధ్వర్యంలో ఆంగ్ల, హిందీ భాషా ఉత్సవాలు జరిగాయి.

ఇచ్ఛాపురం రూరల్: కొళిగాం ఉన్నత పాఠశాలలో హిందీ భాషా దినోత్సవాన్ని నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు, హిందీ భాషోపాధ్యాయుడు నరేంద్రనాథ్ పట్నాయక్ హిందీ భాష ఆవశ్యకతను, గొప్పతనాన్ని వివరించారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి.



కంచిలి: జాడుపూడి కేజీబీవీలో ఆంగ్ల భాషోత్సవంలో విద్యార్థినులు

మంత్రి మెప్పు కోసమే తిలక్‌పై విమర్శలు

- టీడీపీ నాయకుడు అజయ్‌కుమార్‌పై వైఎస్సార్‌సీపీ నాయకులు ఆగ్రహం

టెక్కలి: మంత్రి అచ్చెన్నాయుడు మెప్పు కోసం వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్‌పై నందిగాం మండలానికి చెందిన టీడీపీ నాయకుడు పినకాన అజయ్‌కుమార్ విమర్శలు చేయడం తగదని నందిగాం ఎంపీపీ ఎస్.శ్రీరామ్మూర్తి, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు అన్నెపు రామారావు, జనరల్ సెక్రటరీ కురమాన బాలకృష్ణ తదితరులు అన్నారు. తిలక్‌పై అజయ్‌కుమార్ ఇటీవల చేసిన విమర్శల ను ఖండించారు. టెక్కలి వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నాయకులు మాట్లాడారు. నందిగాం మండలంలో పీఏసీఎస్ అధ్యక్షునిగా ఉన్న కాలంలో భూ రికార్డులు తారుమారు చేసి బ్యాంకు రుణాలతో లెక్కలేని అవినీతి అక్రమాలకు పాల్పడిన వ్యక్తి అజయ్‌కుమార్ అని దుయ్యబట్టారు. అవినీతి కేసుల మాఫీ కోసం, కుటుంబ సభ్యుల బదిలీల కోసం గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో తిలక్ చుట్టూ తిరిగి పనులు చేయించుకున్న వ్యక్తి ఈ రోజు అతనిపైనే విమర్శలు చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. రాజకీయ దళారీగా.. కమీషన్లకు కక్కుర్తి పడుతూ మంత్రి మెప్పు కోసం వైఎస్సార్‌సీపీ నాయకులపై విమర్శలు చేయడం సిగ్గుచేటుగా ఉందన్నారు. నందిగాం మండలంలో తన క్రషర్‌ను తిలక్ 2016లో లీజుకిచ్చేశారని దీనిపై ఆరోపణలు చేయడం టీడీపీ నాయకుల అవగాహన లోపం అన్నారు. నియోజకవర్గంలో ఒకే సామాజిక వర్గానికి చెందిన వారి క్రషర్లపై కక్ష పూరితమైన చర్యలకు పాల్పడుతున్న మంత్రి అచ్చెన్నాయుడు కుట్రలు మీకు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. మంత్రి చేస్తున్న అవినీతిపై పత్రికల్లో వచ్చిన కథనాలు చూడడం లేదా అని నిలదీశారు. కింజరాపు కుటుంబం చేస్తున్న అవినీతి అక్రమాలపై తమ దగ్గర సాక్ష్యాలు ఉన్నాయని.. అవి అబద్ధం అని నిరూపించగలరా అని సవాల్ విసిరారు. ధాన్యం కొనుగోలులో అక్రమాలకు పాల్పడే బోయిన రమేష్‌తో పాటు రాజస్థాన్‌కు చెందిన బ్రోకర్లకు అధ్యక్ష పదవులను కట్టబెట్టి వారి నుంచి అచ్చెన్నాయుడు కుటుంబ సభ్యులు కోట్లాది రూపాయలు దండుకుంటున్నారని ఆరోపించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో నిమ్మాడలో జరిగిన అభివృద్ధిపై శ్వేతపత్రం విడుదల చేస్తామని.. అది అబద్ధమని నిరూపించి దమ్ముంటే అచ్చెన్నాయుడు తన పదవికి రాజీనామా చేయాలని సవాల్ చేశారు. టెక్కలిలో పాలన వైపు దృష్టి పెట్టకుండా ఒకే సామాజిక వర్గం పోలీస్ అధికారులతో కక్ష సాధింపు చర్యలు చేస్తున్నారని మండిపడ్డారు. మంత్రి దగ్గర మెప్పు పొందుతూ నామినేటెడ్ పదవుల కోసం కక్కుర్తి పడి టీడీపీ నాయకులు వైఎస్సార్‌సీపీ నాయకులపై అర్థం లేని విమర్శలు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. కోటబొమ్మాళి జెడ్పీటీసీ సభ్యుడు దుబ్బ వెంకట్రావు, పార్టీ మండల అధ్యక్షులు, వివిధ అనుబంధ విభాగాలకు చెందిన నాయకులు సత్తారు సత్యం, హెచ్.వెంకటేశ్వరరావు, ఎస్.హేమసుందర్‌రాజు, టి.ఫాల్గుణరావు, చిన్నిజోగారావు, ఎస్.భీమారావు, జె.జయరాం, ఎస్.వినోద్, యు.తమ్మయ్య, వి.తవిటయ్య, ఎ. విష్ణు, బి.గున్నయ్య, బి.రాజేష్, కె.జీవన్, టి.రాజు, టి.జగ్గారావు ఉన్నారు.



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు